సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



వైనతేయ నదిలో మునిగి బాలుడి గల్లంతు

10లో

వైనతేయ నదీ పాయలో స్నానం చేస్తుండగా ఒక బాలుడు గల్లంతయ్యారు. మరో బాలుడిని బంధువు రక్షించారు.



ఉన్నత విద్యారంగం అభివృద్ధికి ప్రత్యేక విజన్

10లో

ఉన్నత విద్య అభివృద్ధికి సీఎం జగన్ ప్రత్యేక విజన్‌తో సాగుతున్నారని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి అన్నారు.

మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 17,589 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. అలాగే తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెలాక్టు 7 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. భద్రాచలం వద్ద 10.40, కాటన్ బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

ముగిసిన సీబీఎస్ఈ సౌత్ జోన్ పోటీలు



సీబీఎస్ఈ సౌత్ జోన్ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జవహర్ హయ్యర్ స్కూల్ జట్టు

రాజానగరం: దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యా నికేతన్‌లో మూడు రోజుల పాటు హోరాహోరీగా జరిగిన సీబీఎస్ఈ సౌత్ జోన్ బాలికల ఫుట్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్స్ ఉత్కంఠగా సాగాయి. విజేతలకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు, డిప్యూటీ డీఈఓ ఇ.నారాయణరావు మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 32 సీబీఎస్ఈ స్కూల్స్ నుంచి 532 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న నాలుగు జట్లూ తమిళనాడుకు చెందినవే కావడం విశేషం. జవహర్ హయ్యర్ స్కూల్ (తమిళనాడు) ప్రథమ స్థానాన్ని అందుకోగా ద్వితీయ స్థానంలో సీఎస్ అకాడమీ (తమిళనాడు) నిలిచింది. ఇక మూడో స్థానంలో అంగర పబ్లిక్ స్కూల్ (తమిళనాడు), ఎస్‌బీఓఏ స్కూల్ (తమిళనాడు) నిలిచాయి. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్ విజయప్రకాష్, గంగాధరం, ప్రిన్సిపాలయ్యేఎస్ఎన్ మూర్తి, అకడమిక్ కోఆర్డినేటర్ విమల, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైట్ కోట్ సెర్మనీ



వైట్ కోట్ సెర్మనీలో పాల్గొన్న వైద్య విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ వైద్య కళాశాలలో 2023–24 సంవత్సరం వైద్య విద్యార్థులకు సోమవారం వైట్ కోట్ సెర్మనీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 150 మంది వైద్య విద్యార్థులు, కళాశాల అధికారులు, అధ్యాపకులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ, వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని అన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలన్నారు. వైద్య వృత్తిని ఎటువంటి చెడు పనులకూ ఉపయోగించబోమని, రోగుల బాగు కోసం వైద్యాన్ని ఉపయోగిస్తామని, సొంత ప్రయోజనాల కోసం సొంత ప్రయోగాలు చేయబోమని వైద్య విద్యార్థులతో హిపోగ్రస్ట్ (ప్రతిజ్ఞ) చేయించారు. కార్యక్రమంలో బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో క్రీడాకారులకు శిక్షణ

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో ఖోఖో శిక్షణ శిబిరాన్ని వైఎంఎస్‌సీ అధ్యక్షుడు పెంటకోట నాగబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోచ్ కర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకూ చిత్తూరు జిల్లా యాదమర్రిలో రాష్ట్ర స్థాయి జూనియర్ ఖోఖో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులకు నాలుగు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

జిల్లా స్థాయి కరాటే పోటీలు

తుని: స్థానిక రోటరీ క్లబ్, జపాన్ కరాటే మార్షల్స్ ఆర్ట్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన పట్టణంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మార్షల్ ఆర్ట్స్ కరాటే ట్రైనర్ త్రినాథ్ పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్న పిల్లలు పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు, పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేఎస్ఎల్ వర్మ, కార్యదర్శి కిషోర్‌రెడ్డి, ట్రెజరర్ గణేష్, రోటరీ ప్రతినిధులు డీవీ రాజు, సీహెచ్ మంగరాజు, ఎం.వివేక్ పాల్గొన్నారు.

7,327 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 12వ రోజు సోమవారం జిల్లా వ్యాప్తంగా 17 వైద్యశిబిరాలు నిర్వహించారు. వీటిలో 7,327 మంది రోగులు వైద్యసేవలు పొందారు. 271 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశామని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక తెలిపారు.





మెరుపులతో మైమరపు : అలరించే లేజర్ షో



కంబాల చెరువు విహంగ వీక్షణం

అందాల చెరువు

- నందనవనంలా రూపు దిద్దుకున్న కంబాల చెరువు
- రూ.13 కోట్లతో ఆధునీకరణ
- ఆకట్టుకోనున్న ప్రత్యేక ఆకర్షణలు
- నేడు ప్రారంభించనున్న మంత్రి ఆదిమూలం సురేష్

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన తరువాత రాజమహేంద్రవరం రూపురేఖలు అద్భుతంగా మారిపోతున్నాయి. కళ్ల ముందే కనిపిస్తున్న ఈ అభివృద్ధిని చూసి పలువురు అదుర్స్ అంటున్నారు. ముఖ్యంగా నగరంలోని కీలకమైన రోడ్లు, ఫుట్‌పాత్‌లు, కూడళ్లు, సందర్శకులు సేద తీరే ప్రాంతాలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ఈ క్రమంలోనే నగరం నడిబొడ్డున ఉన్న కంబాల చెరువు అందాల చెరువుగా రూపు దిద్దుకుంది. ఆధునీకరించిన కంబాల చెరువు పార్కును రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలం సురేష్ మంగళవారం రాత్రి 7 గంటలకు ప్రారంభించనున్నారు.



మురిపించేలా..: కంబాల చెరువు బోర్డు



ఓ సెల్ఫీ దిగుదాం: ఆకట్టుకుంటున్న సెల్ఫీ పాయింట్

కీలక ప్రాంతం

రాజమహేంద్రవరం పేరు చెప్పగానే చాలామందికి ఠక్కున గుర్తుకు వచ్చే ప్రాంతాలు దేవీచౌక్, పుష్కర ఘాట్, కోటిలింగాల రేవు, ఇస్కాన్ టెంపుల్‌తో పాటు కంబాల చెరువు కూడా. దూర ప్రాంతాల నుంచి బస్సుల్లో వచ్చే అనేక మంది ఇక్కడే దిగుతారు. ఇక్కడి నుంచే కాకినాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు ఎక్కుతారు. అంతే కాదు.. దేవీ చౌక్, గోదావరి తీరాన ఉన్న పుష్కర ఘాట్, కోటిలింగాల రేవుతో పాటు మారేడుమిల్లి వంటి సందర్శనీయ స్థలాలకు ఇక్కడి నుంచే చాలా మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి కీలక ప్రాంతమైన కంబాల చెరువు సెంటర్ చాలా కాలంగా అభివృద్ధికి నోచలేదు. మురుగు నీటితో ఈ చెరువు నీరు ముక్కుపుటాలదిరేలా దుర్గంధభరితంగా మారడంతో అటుపక్కగా వెళ్లేవారు ఇబ్బందులు పడేవారు.

జిల్లాలోనే ఎక్కడా లేని రీతిలో..

ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సాయం సమయాల్లో నగర వాసులు కాసేపు సేద తీరాలంటే ఇప్పటి వరకూ గోదావరి తీరమే గతి. ఈ లోటును భర్తీ చేసేలా వినూత్న హంగులతో కంబాల చెరువును అభివృద్ధి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులు రూ.5 కోట్లు, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) రూ.2 కోట్లు, నగరపాలక సంస్థ జనరల్ ఫండ్ రూ.6 కోట్లు కలిపి మొత్తం రూ.13 కోట్లతో అనేక పర్యాటక ఆకర్షణలను అందుబాటులోకి తెచ్చారు. పూడికలు, వ్యర్థాలను పూర్తిగా తొలగించారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా, దుర్గంధ భరితం కాకుండా చర్యలు చేపట్టారు. వాన నీరు తప్ప కాలువల్లోని వ్యర్థాలు చెరువులో చేరకుండా మెష్‌లు ఏర్పాటు చేశారు. మంచి మట్టితో వాకింగ్ ట్రాక్ వేశారు.



ఎన్నో ఆకర్షణలు

- జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా మ్యూజికల్ ఫౌంటైన్ కమ్ లేజర్ షో ఏర్పాటు చేశారు. ఈ షోలో భాగంగా 15 నిమిషాల పాటు రాజమహేంద్రవరం నగర చరిత్ర, పవిత్ర గోదావరి నది విశిష్టత గురించి వాటర్ స్క్రీన్‌పై చిత్రం ప్రదర్శిస్తారు. వీనుల విందైన సంగీతంతో ఈ లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.
- మన జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో ఎక్కడా లేనివిధంగా స్కై సైకిల్ ఏర్పాటు చేశారు. చెరువుపై గాలిలో అమర్చిన తీగలపై 116 మీటర్ల మేర సైకిల్ తొక్కుతూ ఆనందించవచ్చు. ఇది చిన్నారులను, యువతను ఎంతో ఆకట్టుకోనుంది.
- చెరువు మీదుగా గాలిలో వేలాడుతూ ప్రయాణించేలా 205 మీటర్ల పొడవున జిప్‌లైన్ సిద్ధం చేశారు. పూర్తి స్థాయి రక్షణ చర్యలు చేపట్టిన అనంతరం ఈ జిప్‌లైన్‌లో ప్రయాణించేందుకు అనుమతి ఇస్తారు.
- కంబాల చెరువుకు వచ్చే సందర్శకులకు కొత్త అనుభూతి కలిగించేలా 360 డిగ్రీల హ్యూమన్ గైరో ఏర్పాటు చేశారు. మనిషి కూర్చున్న తరువాత ఇది 360 డిగ్రీల్లో తిరుగుతూ ఆహ్లాదాన్ని పంచుతుంది.
- ఇద్దరు మనుషులు ప్రయాణించేందుకు వీలుగా చెరువులో ప్రస్తుతం రెండు పెడల్ బోట్లు కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. సందర్శకుల రద్దీని బట్టి మరిన్ని బోట్లు తీసుకురానున్నారు.
- చిన్నారులను ఆకట్టుకునే బొమ్మలతో స్కల్ప్చర్ స్టోరీ గార్డెన్ రూపొందించారు.
- అలాగే అన్ని వర్గాల వారూ ఆడుకునేలా ప్లే కోర్టు ఏర్పాటు చేశారు. ఇంకా చిన్నారులకు ప్రత్యేక పార్కు, సెల్ఫీ పాయింట్, పాదచారులు నడిచేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి వంటి అనేక ఆకర్షణలను కంబాల చెరువు పార్కులో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇక నుంచి ఈ పార్కు సందర్శకులకు సరికొత్త అనుభూతిని పంచనుంది.



మరింతగా అభివృద్ధి చేస్తాం

చారిత్రక రాజమహేంద్రవరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు మరిన్ని అభివృద్ధి చర్యలు చేపడుతున్నాం. కోట్లాది రూపాయల వ్యయంతో నగరంలోని పలు జంక్షన్లను అభివృద్ధి చేశాం. మరిన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– కె.దినేష్ కుమార్, కమిషనర్, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

జిల్లాలో 231 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణకు 231 కొనుగోలు కేంద్రాలు (పీపీసీ) ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 141 ప్రారంభించామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలపై ఆమె సోమవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. మొత్తం 231 పీపీసీల ద్వారా రైతుల నుంచి 4,30,287.34 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. గన్నీ బ్యాగ్‌లు 79,79,993 అవసరం కాగా ఇప్పటి వరకూ 25,21,128 అందించామన్నారు. రైతుభరోసా కేంద్రాల్లోని (ఆర్‌బీకే) పీపీసీలకు అనుసంధానంగా ఉన్న 2,310 వాహనాలకు జీపీఎస్ అమర్చాల్సి ఉందని, ఇప్పటి వరకూ 1,522 వాహనాలను గుర్తించామని 437 వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేశామని వివరించారు. రైతులు పంట కోతలు ప్రారంభించి, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు తేమ శాతం 17కు మించకుండా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలించాలని కోరారు. దీనిపై రైతులకు క్షేత్ర స్థాయి సిబ్బంది పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని ఆదేశించారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం రెండో దశలో భాగంగా జిల్లాలో 19,253 ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. తొలి దశ లక్ష్యాలను అధికారుల సమన్వయంతో పూర్తి చేశామన్నారు. జిల్లాలోని 267 లేఅవుట్లలో ఇప్పటి వరకూ 1,334 సోక్‌పిట్స్ గ్రౌండింగ్ కాగా 468 పూర్తయ్యాయన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా జిల్లావ్యాప్తంగా శనివారం వరకూ 188 వైద్య శిబిరాలు నిర్వహించామని, 88,818 ఓపీ నమోదైందని తెలిపారు. రెండో విడత రీ సర్వేలో భాగంగా ఈ–కేవైసీ 39,546కు గాను 39,530 పూర్తి చేశామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, డీఆర్ఓ జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ మాధవీలత
- 161 ఫిర్యాదుల స్వీకరణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్పందన, జగనన్నకు చెబుదాం అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్‌తో కలిసి ఆమె కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్‌కు, 1902 నంబర్‌కు ప్రజలు సమస్యలు తెలియజేస్తున్నారని, ఎప్పటికప్పుడు లాగిన్ ఓపెన్ చేసి వీటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. స్పందనకు ఆన్‌లైన్‌లో 142, ఆఫ్‌లైన్‌లో 19 అర్జీలు వచ్చాయని తెలిపారు. వీటిలో రెవెన్యూకు సంబంధించి 57, పోలీసు శాఖకు 45, ఇతర శాఖలవి 59 ఉన్నాయని వివరించారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్, జేసీ తేజ్‌భరత్

ఈవీఎంల తనిఖీ ప్రారంభం

జిల్లాకు కేటాయించిన ఈవీఎంల మొదటి దశ తనిఖీలు స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. బెంగళూరులోని బెల్ సంస్థకు చెందిన సీనియర్ సాంకేతిక ఇంజినీర్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈవీఎంల తనిఖీల ప్రక్రియ, సెల్ డిపాజిట్ కౌంటర్, ఇతర భద్రతా ఏర్పాట్లను ఎస్పీ జగదీష్, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ మాధవీలత పరిశీలించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఈవీఎం, అనుబంధ పరికరాల తనిఖీలను అధీకృత బెల్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రారంభించామని ఆమె చెప్పారు. జిల్లాకు చెందిన 5,971 బ్యాలెట్ యూనిట్లు, 5,463 కంట్రోల్ యూనిట్లు, 4,927 వీవీ పాట్ యూనిట్లను తనిఖీ చేస్తారని వివరించారు. ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకూ తనిఖీ ప్రక్రియ ఉంటుందని, ఇక్కడ విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లు ఉపయోగించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరుగుతుందని, ఇన్‌చార్జిగా రాజమహేంద్రవరం ఆర్‌డీఓ చైత్రవర్షిణి వ్యవహరిస్తారని తెలిపారు. భద్రతా సిబ్బందికి అందరూ సహకరించాలని ఎస్పీ జగదీష్ అన్నారు.

అప్పటికప్పుడే..



- రైతుకు దండిగా పంట రుణాలిస్తున్న డీసీసీబీ
- రెండు మూడు రోజుల్లోనే అందజేత
- నెలాఖరు వరకూ మంజూరుకు అవకాశం

రైతులకు డీసీసీబీ ఖరీఫ్ పంట రుణాలిచ్చిందిలా..

లక్ష్యం	:రూ.780 కోట్లు
ఇప్పటి వరకూ ఇచ్చినది	:రూ.365 కోట్లు
రుణాలు పొందిన రైతులు	: 2,10,000

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సాగుకు శ్రీకారం చుట్టింది మొదలు అన్నదాతకు అడుగడుగునా పెట్టుబడి అవసరమవుతూంటుంది. దుక్కి చేయడం.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనడం.. కూలీ ఖర్చులు.. ఇలా ప్రతి ఎకరాకు సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ పెట్టుబడి అవుతూంటుంది. పంట పెట్టుబడుల కోసం రైతులు ఒకప్పుడు ప్రైవేటు వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఫలితంగా ఆరుగాలం పడిన శ్రమ తప్ప.. వారి చేతికి వచ్చే లాభం పెద్దగా ఉండేది కాదు. వచ్చిన మిగులు ఏదైనా ఉంటే.. అదంతా ఆయా ప్రైవేటు వ్యాపారుల వద్ద తెచ్చిన రుణాలకు చెల్లించాల్సిన వడ్డీకే సరిపోయేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత అన్నదాతలకు ఈ బాధలు తప్పాయి. తీసుకున్న పంట రుణం సకాలంలో చెల్లించిన రైతులపై వడ్డీ భారం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులతో పాటు వాణిజ్య బ్యాంకుల నుంచి కూడా రైతులకు రుణాలు అందుబాటులోకి తీసుకువస్తోంది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా రైతులకు దండిగా రుణాలు అందిస్తోంది. అవసరమైన ప్రతి రైతుకూ పంట రుణాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఖరీఫ్‌లో రూ.780 కోట్ల మేర పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటి వరకూ రూ.365 కోట్లు పంపిణీ చేసింది. ఉమ్మడి జిల్లాలోని 50 డీసీసీబీ బ్రాంచిలు, 300 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా 2.10 లక్షల మంది రైతులు పంట రుణాలు పొందారు.

వడ్డీ భారం లేకుండా..

పంట రుణాల కోసం వాణిజ్య బ్యాంకులకు వెళ్తే బోలెడు నిబంధనలు పెడతారు. వారం, పది రోజులు ఆయా బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఉంటుంది. కానీ డీసీసీబీ ద్వారా రెండు మూడు రోజుల్లోనే రైతులకు కావాల్సిన పంట రుణాలు అందిస్తున్నారు. దీంతో సహకార సంఘాల్లో రుణాలు తీసుకునేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. సహకార సంఘాల ద్వారా భూమికి సంబంధించిన పాస్ పుస్తకం ఆధారంగా ఎకరానికి రూ.50 వేల వరకూ పంట రుణాలు అందిస్తున్నారు. ఏటా డీసీసీబీ ద్వారా సుమారు 3 లక్షల మంది పైగా రైతులు పంట రుణాలు పొందుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి రైతుకూ పంట రుణాలు అందించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంది. పైగా రైతులపై వడ్డీ భారం పడకుండా ప్రభుత్వమే ఆ 7 శాతం వడ్డీని బ్యాంకులకు చెల్లిస్తోంది. తీసుకున్న పంట రుణాలను సంవత్సరంలోగా తిరిగి చెల్లిస్తే రైతులు ఎటువంటి వడ్డీ కట్టాల్సిన అవసరం ఉండదు.

రెండు రోజుల్లోనే మంజూరు



నాకు సామర్లకోట మండలం పవర గ్రామంలో రెండెకరాలు పంట పొలం ఉంది. పెట్టుబడి సాయం కోసం గ్రామంలోని సహకార సంఘానికి వెళ్తే రూ.లక్ష పంట రుణం ఇస్తానన్నారు. నాకు రూ.70 వేలు సరిపోతుందని చెప్పడంతో రెండు రోజుల్లోనే ఆ రుణం మంజూరు చేశారు. కేవలం పాస్ పుస్తకం తీసుకొని ఈ రుణం మంజూరు చేశారు.

– మండపాక సాగరరావు, రైతు, చంద్రపాలెం, సామర్లకోట మండలం

ప్రతి రైతుకూ పంట రుణం



పంటల సాగుకు పెట్టుబడి అవసరమైన ప్రతి రైతుకూ రుణం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెలాఖరు వరకూ పంట రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంది. అవసరమైన రైతులు సమీపంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో సంప్రదించాలి.

– ఆకుల వీర్రాజు, చైర్మన్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, కాకినాడ

'నన్నయ'లో రూ.28.3 కోట్లతో నూతన భవనాలు



ఈసీ సమావేశంలో పాల్గొన్న అధికారులు, సభ్యులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో రూ.28.3 కోట్లతో కొత్తగా నిర్మించే భవనాలకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) ఆమోదం తెలిపింది. ఉప కులపతి, ఈసీ చైర్మన్ ఆచార్య కె.పద్మరాజు ఈ విషయం తెలిపారు. పరీక్షలు, సైన్స్ కాలేజీ కోసం ఈ భవనాలను నిర్మిస్తున్నారు. వర్సిటీలో సోమవారం జరిగిన ఈసీ సమావేశం వివరాలను ఆయన విలేకర్లకు తెలిపారు. వర్సిటీలో విద్య, పరిపాలన, నూతన నిర్మాణాలు, అభివృద్ధి, అధ్యాపక పోస్టుల భర్తీ, రేషనలైజేషన్ తదితర అంశాలపై చర్చించామన్నారు. వర్సిటీలో 99 అధ్యాపక పోస్టుల భర్తీకి ఆమోదం లభించిందన్నారు. తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో రెండు ల్యాబ్‌లకు, కాకినాడ క్యాంపస్ భవన ఆధునీకరణకు కూడా ఈసీ ఆమోదం తెలిపిందని వీసీ ఆచార్య పద్మరాజు వివరించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఈసీ సభ్యులు ఆచార్య పి.సురేష్‌వర్మ, డాక్టర్ పి.విజయనిర్మల, డాక్టర్ కె.జ్యోతి, డాక్టర్ కె.నూకరత్నం, వసంతలక్ష్మి, షేక్ సులేమాన్, గంధం నారాయణరావు, రాజ్‌కుమార్, వై.సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరోగ్యానికి 'సురక్ష' ఇది



వెంకట్రావుకు వైద్య సేవలందిస్తున్న వైద్యులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు స్థానికులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఇదిలాఉంటే ఆ ప్రాంతానికి చెందిన వెంకట్రావుకు బీపీ తగ్గిపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందడంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉన్న డాక్టర్ రవి కుమార్ హుటాహుటిన అస్వస్థతకు గురైన వ్యక్తి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించారు. దీంతో ఆయన కోలుకోవడంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం



ఈలకొలనులో అధికారులు సీజ్ చేసిన లారీ

రంగంపేట: పీడీఎస్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్నారు. రీజినల్ విజిలెన్స్ ఇన్చార్జి ఎస్పీ కె.కుమార్ కథనం ప్రకారం.. రంగంపేట మండలం ఈలకొలను గ్రామ సమీపంలో లారీలో రేషన్ బియ్యం రవాణా జరుగుతున్నట్టు సమాచారం అందడంతో వాహన తనిఖీలు నిర్వహించారు. ఓ లారీని తనిఖీ చేయగా 713 ప్లాస్టిక్ బస్తాల్లో సుమారు 35,660 కిలోల బియ్యాన్ని గుర్తించారు. దీని విలువ రూ. 54,26,400గా నిర్ధారించారు. పీడీఎస్ బియ్యం గుంటూరుకు చెందిన సామ కార్తీక్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరంలోని బుచ్చయ్యనగర్‌కు చెందిన లారీ డ్రైవర్ నల్లశెట్టి మురళీకృష్ణ మచిలీపట్నం నుంచి తరలిస్తున్నట్టు తెలిపారు. బియ్యం రవాణాకు సంబంధించి సరైన బిల్లులు లేనందున సివిల్ సప్లయిస్ అధికారులు లారీని, బియ్యాన్ని సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసి లారీ డ్రైవర్, బియ్యం యజమాని, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు కోసం రంగంపేట పోలీసులకు సిఫారసు చేశారు. తనిఖీల్లో కార్యాలయ సబ్‌ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, జియాలజిస్టు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యా వికాసానికి విజ్ఞాన జ్యోతి

- చిన్నారులకు ఉత్తమ బోధన
- మెరుగైన అభ్యసనానికి 'ఎఫ్ఎల్ఎన్'
- ప్రాథమిక, పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు

రాయవరం: ఒక భవనం నిర్మించేటప్పుడు పునాది బలంగా ఉండాలి. అప్పుడే భవనంపై ఎన్ని అంతస్తులైనా కట్టొచ్చు. ఇదే విధానం విద్యార్థికీ వర్తిస్తోంది. ఒక విద్యార్థికి పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో పునాది బలం ఉంటే అభ్యసనా సామర్థ్యాలను సులభంగా చేరుకుంటాడు. అందుకే ఇప్పుడు ప్రభుత్వం పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థి అభ్యసనా సామర్థ్యాల పెంపుదలకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని చేపట్టింది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్)లో భాగంగా ఎన్‌జీవో సంస్థ ప్రథమ్ భాగస్వామ్యంతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పూర్వ, ప్రాథమిక పాఠశాలల్లో అమలుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది.

ఈసీసీఈలో భాగంగా..

నూతన విద్యా విధానం–2020లో భాగంగా ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను ప్రవేశపెట్టింది. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో భాగంగా ఎర్లీ చైల్డ్ సెంటర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)ను ప్రవేశపెట్టింది. ఇందులో ప్రీ ప్రైమరీ–1, 2ను అమలు చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ–1లో 3–4 ఏళ్ల చిన్నారులకు, ప్రీ ప్రైమరీ–2లో 4–5 ఏళ్ల చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యా బోధన చేస్తారు. ప్రీ ప్రైమరీలోనే పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలను అమలు చేస్తారు. ఐదేళ్లు నిండిన చిన్నారులు ప్రైమరీ తరగతులు నిర్వహిస్తారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీలో 1, 2 తరగతులకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2026–27 విద్యా సంవత్సరానికి రెండో తరగతి నుంచి మూడో తరగతికి వెళ్లే విద్యార్థులంతా ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను కచ్చితంగా పొందాల్సి ఉంటుంది.



శిక్షణలో భాగంగా కృత్యాలు ప్రదర్శిస్తున్న డీఆర్పీలు

నైపుణ్యాలు సాధించేందుకు..

ప్రతి విద్యార్థి ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను పొందాల్సి ఉంటుంది. అయితే పదో తరగతికి చేరుకుంటున్న విద్యార్థులు తెలుగు, గణితంలో ప్రాథమిక భావనలు ఉండడం లేదన్న కఠోర వాస్తవాలను అసర్, నాస్, శ్లాస్ తదితర నివేదికలు బహిర్గతం చేశాయి. దీంతో ప్రభుత్వం పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలను సాధించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతుంది. అందులో భాగంగానే ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమం చేపట్టింది. పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్య (1, 2 తరగతులు) పూర్తి చేసి మూడో తరగతిలో చేరే సమయానికి తెలుగులో చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం రావాల్సి ఉంటుంది. గణితంలో చతుర్విధ ప్రక్రియలు కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారంపై నైపుణ్యాలు సాధించాలి.

డీఆర్పీలకు శిక్షణ పూర్తి

ఎఫ్ఎల్ఎన్ అమల్లో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యను జ్ఞాన జ్యోతిగా, ప్రాథమిక విద్యను జ్ఞాన ప్రకాష్‌గా పేర్కొన్నారు. తొలుత ప్రాథమిక విద్యను బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు డీఆర్పీలకు శిక్షణ పూర్తి చేశారు. మండలానికి ముగ్గురు ఎస్జీటీ ఉపాధ్యాయులను డీఆర్పీలుగా ఎంపిక చేసిన వారికి రెసిడెన్షియల్ విధానంలో శిక్షణనిచ్చారు. ప్రతి జిల్లాలో ఒక్కో మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయుల చొప్పున శిక్షణ ఇస్తున్నారు. కోనసీమ జిల్లా నుంచి 66 మంది డీఆర్పీలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. త్వరలోనే డీఆర్పీలు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం జ్ఞానజ్యోతిలో భాగంగా డీఆర్పీలుగా ఎంపిక చేసిన వారికి కూడా ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకూ విశాఖపట్నంలో మండలానికి ముగ్గురు డీఆర్పీల వంతున మొదటి స్పెల్‌లో 33 మంది శిక్షణ పొందుతుండగా, రెండో స్పెల్‌లో 33 మంది శిక్షణ ఇవ్వనున్నారు.

సమగ్రాభివృద్ధి సాధ్యం



ఎఫ్ఎల్ఎన్ ద్వారా చిన్నారుల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. మూడు నుంచి ఎనిమిదేళ్ల వయసు వచ్చేసరికి ప్రాథమిక విద్య బలోపేతంలో భాగంగా పునాది విద్యను పటిష్టం చేస్తున్నాం. అంగన్‌వాడీ కార్యకర్తలకు తర్ఫీదు పొందిన డీఆర్పీలు శిక్షణ ఇస్తారు.

–వై.విజయశ్రీ, కీ రిసోర్స్ పర్సన్, సీడీపీఓ, పి.గన్నవరం

ఇదో మంచి కార్యక్రమం



ఎఫ్ఎల్ఎన్‌లో ఇప్పటికే 60 రోజుల శిక్షణలో భాగంగా జిల్లాలో డీఆర్పీలకు శిక్షణ ఇచ్చాం. రెండో దశ 120 రోజుల శిక్షణ పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్యను బోధించే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎస్జీటీలకు శిక్షణ ఇచ్చే డీఆర్పీలకు శిక్షణ ఇస్తాం. ఎఫ్ఎల్ఎన్ చాలా మంచి కార్యక్రమం. తప్పనిసరిగా విజయవంతమవుతుంది.

– ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

వెంకన్న సన్నిధిలో అజేయకల్లాం



ప్రభుత్వ ప్రధాన సలహాదారు అజేయకల్లాంకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారిని విశ్రాంత ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు అజేయకల్లాం సోమవారం దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న కల్లాం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చరిత్రను అర్చకులు వివరించారు. స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

నేడు 'సంహిత'లో మెగా జాబ్‌మేళా

రావులపాలెం: స్థానిక సంహిత డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. దీనికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. ఈ మేళా ద్వారా సుమారు వెయ్యి మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్ చేసిన వారు హాజరు కావాలన్నారు. జీతం రూ.12 వేల నుంచి రూ.40 వేల వరకూ (ఆయా ఉద్యోగాలను బట్టీ) ఉంటుందన్నారు.

ఉన్నత విద్యారంగం అభివృద్ధికి ప్రత్యేక విజన్

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి
- ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డుతో 'నన్నయ' ఒప్పందం

రాజానగరం: రాష్ట్రంలో ఉన్నత విద్యా రంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక విజన్‌తో ముందుకు సాగుతున్నారని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి అన్నారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డుతో ఆదికవి నన్నయ యూనివర్సిటీకి కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) నేపథ్యంలో స్థానిక యూనివర్సిటీలోని కన్వెన్షన్ హాలులో సోమవారం వర్క్‌షాప్ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్‌ల ద్వారా విద్యార్థులకు సరికొత్త అవకాశాలను అందిస్తూ, ఉపాధి, ఉద్యోగావకాశాలను మెరుగుపరుస్తున్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ అద్భుతాలు సృష్టించే దిశగా అడుగులు వేయాలని విద్యార్థులకు సూచించారు. కోవిడ్ సంక్షోభం తరువాత ఆన్‌లైన్ లెర్నింగ్‌పై ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారన్నారు.



ఆచార్య హేమచంద్రారెడ్డి, వీసీ పద్మరాజు సమక్షంలో ఎంఓయూలను మార్చుకుంటున్న ఆచార్య సుధాకర్, తిరుమల ఆరోహి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జాతీయ విద్యావిధానం 2020 అమలులో దేశంలోనే ముందంజలో ఉందన్నారు. ఇందులో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. మారుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో అధ్యాపకులు, విద్యార్థులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలన్నారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేందుకు చేస్తున్న కృషిలో భాగంగా ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డుతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. దీనిద్వారా అధ్యాపకులు, విద్యార్థులు అవసరమైన టెక్నాలజీ స్కిల్స్‌ను పొందే అవకాశం ఉంటుందన్నారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ఉపాధ్యక్షులు తిరుమల ఆరోహి మాట్లాడుతూ తమ వద్ద 20 వేల కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఎంఓయూ ద్వారా 'నన్నయ' వర్సిటీ, అనుబంధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు తమకు నచ్చిన కోర్సులో రిజిస్ట్రేషన్ చేసుకుని, శిక్షణ పొందవచ్చన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత పొందే సర్టిఫికెట్స్‌తో ఓపెన్ మార్కెట్‌లో మంచి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఇన్ఫోసిస్ సీనియర్ బిజినెస్ మేనేజర్ డాక్టర్ ఎస్.మీనాక్షి, లెర్నింగ్ స్పెషలిస్ట్ కుమారస్వామిలు రిసోర్స్‌పర్సన్లుగా నూతన టెక్నాలజీకి సంబంధించిన వివిధ అంశాలను వివరించారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ఉపాధ్యక్షులు తిరుమల ఆరోహిలు ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేసి, పరస్పరం మార్చుకున్నారు. జేఎన్‌టీయూకే అధ్యాపకులు జేవీఆర్ మూర్తి, డీన్ ఆచార్య పి.సురేష్‌వర్మ, ఐక్యూ ఏసీ డైరెక్టర్ డాక్టర్ వి.పెర్సిస్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్రావు, సీఎస్ఈ హెచ్ఓడీ డాక్టర్ బి.కె జియారాణి, డాక్టర్ లత తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను కొలిస్తే అన్నీ శుభాలే

- వెదురుపాక పీఠంలో వైభవంగా శరన్నవరాత్రులు
- బాలాత్రిపురసుందరి అవతారంలో అమ్మవారు



బాలాత్రిపురసుందరీదేవిగా విజయదుర్గమ్మ

రాయవరం: దుష్ట సంహారం చేస్తూ.. శిష్టరక్షణ పాలన చేసే దుర్గమ్మను కొలిస్తే శుభాలు వెన్నంటే ఉంటాయని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు విజయదుర్గా పీఠంలో రెండో రోజు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీఠానికి హాజరైన భక్తులనుద్దేశించి, ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ప్రతి ఒక్కరూ ఏకాగ్రత, చిత్తశుద్ధితో అమ్మవారిని పూజిస్తే అమ్మ కృపకు పాత్రులవుతారన్నారు. శరన్నవరాత్ర ఉత్సవాల ప్రాధాన్యం, బాలాత్రిపుర సుందరీదేవి అవతార ప్రాధాన్యాన్ని గాడ్ భక్తులకు వివరించారు. తొలుత విజయదుర్గమ్మ వారిని బాలా త్రిపురసుందరీదేవిగా అలంకరించారు. పీఠం పురోహితుల ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాతసేవ, దుర్గా, లలితా అష్టోత్తర సహస్రనామాలతో అర్చనతో పాటు నవగ్రహ పూజలు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీఠంలో స్వయంగా కలశాలు ఏర్పాటు చేసుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి అసోసియేట్ మాజీ రీజనల్ కోఆర్డినేటర్ కందర్ప హనుమాన్, పలువురు భక్తులు పూజల అనంతరం పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి) ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న పీఠాధిపతి గాడ్

నారాయణి సిల్క్స్ ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామీజీ

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): పట్టుచీరల ప్రాశస్త్యాన్ని మరింత విస్తరించడంలో భాగంగా నారాయణి సిల్క్స్ 8వ షోరూంను రాజమహేంద్రవరంలో సోమవారం ప్రారంభించామని నిర్వాహకులు తెలిపారు. స్థానిక కోటగుమ్మం వద్ద ఏర్పాటు చేసిన ఈ షోరూంను శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించగా, సినీనటి శ్రీలీల జ్యోతిప్రజ్వలన చేసి పలు వస్త్రాలను తిలకించారు. ఈ సందర్భంగా పరిపూర్ణానంద స్వామీజీ మాట్లాడుతూ సంప్రదాయం, ఆధునికత కలబోసిన కాంచీపురం నారాయణి సిల్క్స్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సినీనటి శ్రీలీల మాట్లాడుతూ దసరా శరన్నవరాత్ర ఉత్సవాల్లో ప్రారంభమైన నారాయణి సిల్క్స్‌లో తెలుగింటి మహిళల అభిరుచులకు తగిన విధంగా అన్నిరకాల పట్టుచీరలు, పురుషులకు సంబంధించిన డి రాయల్ బ్రాండెడ్ దుస్తుల కలెక్షన్లు బాగున్నాయని తెలిపారు. శ్రీలీలను చూసేందుకు అభిమానులు తరలిరావడంతో కోటగుమ్మం ప్రాంతం జనంతో నిండిపోయింది.



వస్త్రాలను తిలకిస్తున్న సినీ నటి శ్రీలీల

సంస్థ డైరెక్టర్ పీవీఎస్ అభినయ్ మాట్లాడుతూ షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతి రూ.15 వేల కొనుగోలుపై 20 గ్రాముల వెండి నాణెం ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ డైరెక్టర్లు ఎస్.సురేష్, టి.కేశవ గుప్తా, టి.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వైనతేయ నదిలో మునిగి బాలుడి గల్లంతు

మరో బాలుడిని రక్షించిన బంధువు



సాయి (ఫైల్)

పి.గన్నవరం: దసరా సెలవులకు కె.ఏనుగుపల్లి గ్రామానికి వచ్చిన ఐదుగురు బాలురు సోమవారం సాయంత్రం వైనతేయ నదీ పాయలో స్నానం చేస్తుండగా ఒకరు గల్లంతయ్యారు. నీటిలో మునిగిపోతున్న మరో బాలుడిని బంధువు రక్షించారు. పి.గన్నవరం ఎస్సై హరికోటి శాస్త్రి కథనం ప్రకారం.. అమలాపురానికి చెందిన సాధనాల సాయి (15), అతడి తమ్ముడు దుర్గేష్ (9), చిన్నమ్మ కుమారుడు వంగా సాయి (11)లు దసరా సెలవులకు ఆదివారం పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చారు. సాధనాల సాయి మేనమామ అయిన తోలేటి దివాకర్ ఇంటికి.. ఆయన స్నేహితుడైన సత్యనారాయణ చెన్నై నుంచి తన కుమారులు అనిరుథ్ (11), హంస్రిష్ (8)లతో కలసి ఇటీవల వచ్చారు. అయితే సోమవారం సాయంత్రం ఐదుగురు బాలలతో కలసి దివాకర్ అతని స్నేహితుడు సత్యనారాయణ ఇంటి వెనుక ఉన్న వైనతేయ నది వద్దకు వెళ్లారు. దివాకర్, సత్యనారాయణలు గట్టు మీద కూర్చొని ఉండగా, ఐదుగురు పిల్లలు నదిలో స్నానానికి దిగారు. ప్రమాదవశాత్తూ సాధనాల సాయి, అనిరుథ్‌లు నీటిలో మునిగిపోయారు. దీనిని గమనించిన దివాకర్ హుటాహుటిన నదిలోకి దూకి అనిరుథ్‌ను రక్షించారు. కళ్ల ముందే మేనల్లుడు సాయి నీట మునిగి గల్లంతయ్యాడు. సాయి కోసం నదిలో గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్సై హరికోటిశాస్త్రి తెలిపారు.



కె.ఏనుగుపల్లిలో గల్లంతైన బాలుడి కోసం నదిలో గాలింపు చర్యలు

విషాదంలో బంధువులు

అమలాపురం వడ్డిగూడెం ప్రాంతానికి చెందిన సాధనాల సాయి గల్లంతుతో రెండు ప్రాంతాల్లోనూ విషాద చాయలు అలముకున్నాయి. సాయి తండ్రి ఏసుబాబు సర్యూలర్ బజారు వద్ద కూరగాయల షాపు నిర్వహిస్తున్నాడు. తల్లి గృహిణి. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడైన సాయి నదిలో స్నానం చేస్తూ గల్లంతు కావడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. ఈ ప్రమాదం నుంచి చిన్న కుమారుడు దుర్గేష్ సురక్షితంగా బయటపడ్డాడు. నదిలో మునిగిపోతున్న సాయిని రక్షించేందుకు మేనమామ దివాకర్ తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు.

ఫుడ్ టెక్నాలజీ విభాగం అప్‌గ్రేడ్‌కు కృషి

కాకినాడ ఎంపీ వంగా గీత

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీలో ఫుడ్ టెక్నాలజీ విభాగం, టెస్టింగ్ ల్యాబ్‌లను కేంద్ర స్థాయిలో అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ వంగా గీత అన్నారు. జేఎన్‌టీయూకే ఫుడ్ టెక్నాలజీ, అసోసియేషన్ ఫర్ ఫుడ్ సైంటిస్ట్స్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఈట్‌రైట్ క్యాంపస్‌గా ఎంపికైన మొదటి యూనివర్సిటీగా నిలవడం సంతోషదాయమని, హరిత విప్లవకారుడు ఎంఎస్ స్వామినాథన్, ధవళేశ్వరం బ్యారేజీ రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్‌ను యువ సాంకేతిక నిపుణులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రైతులకు తోడ్పాటు అందించే విధంగా వర్సిటీలో ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ పదార్థాల నాణ్యత తెలుసుకునే ల్యాబ్ వర్సిటీ ఉండటం మంచి విషయమన్నారు. ఇక్కడ ఉభయగోదావరి జిల్లాలకు ఉపయోగపడేలా ఆక్వారంగ పరిశోధనలు జరగాలని అన్నారు. జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి బైపీసీ విద్యార్థులు ఫుడ్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే అవకాశం కల్పించామని, ఈట్ రైట్ మొదటి క్యాంపస్‌గా యూనివర్సిటీ ఎంపికైందన్నారు. ఫుడ్ టెక్నాలజీ ల్యాబ్‌లో ఆహార పదార్థాలు పరీక్షించేందుకు అత్యాధునిక టెస్టింగ్ సదుపాయాలు ఉన్నాయన్నారు. ఇటీవల ఇక్కడి విద్యార్థులు చిరు ధాన్యాలు, వాటి ఆవశ్యకతపై రూపొందించిన లఘు చిత్రానికి జాతీయ స్థాయిలో మూడో స్థానం లభించడం ఆనందదాయకమన్నారు. రెక్టార్ కేవీ రమణ మాట్లాడుతూ ముఖ్యంగా ఆహార వృథాను అరికట్టాలని, నూతన ఆవిష్కరణలకు ఫుడ్ ఇంజినీరింగ్ విద్యార్థులు నాంది పలకాలని పిలుపునిచ్చారు. ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్ మాట్లాడుతూ దేశం ప్రపంచ ఆకలి సూచికలో 117 దేశాలతో పోలిస్తే 104వ స్థానంలో ఉందన్నారు. కేంద్ర ఆహార భద్రతా చట్టం ద్వారా ప్రతి నెలా 80 కోట్ల మందికి బియ్యం, గోధుమలు రూపంలో నిత్యావసరాలు సరఫరా చేస్తుందన్నారు. ప్రపంచంలో 8 శాతం మంది ప్రజలు సరైన పోషక పదార్థాలు అందక రోగాల బారిన పడుతున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎస్‌టీ డైరెక్టర్ డాక్టర్ గోపాలకృష్ణ, ప్రొఫెసర్ మురళీకృష్ణ, బీటీ కృష్ణ, ఫుడ్ కంట్రోలర్ ఆఫీసర్ శ్రీనివాస్, వర్సిటీ ఈసీ మెంటర్ బెజవాడ వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీత, చిత్రంలో ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, వీసీ ప్రసాదరాజు